# సృష్టి కౌంటర్





—సుస్మితా రమణమూర్తి


సాయంత్రం అయిదు గంటలు కావస్తున్నా సూర్యుడింకా మండిపోతూనే వున్నాడు.

బస్టాప్‌లో ఖాళీ లేకుండా కూర్చబడ్డ బంగాళా దుంపల్లా ఆగివున్న బస్సులోని జనం క్రిక్కిరిసిపోయి వున్నారు.

బస్సు కదిలితే వూపిరి పీల్చుకోడానికి కాస్త గాలైనా వస్తుందన్న ఆశతో ఎదురుచూసి...ఎదురు చూసిన ప్రయాణీకుల ఓపిక నశించిపోయింది.

తలోరకంగా వాళ్లలో వాళ్లే స్వగతంలా నిట్టూర్పులు విడుస్తున్నారు.

"ఈ తద్దినం కోరి కోరి మనం తెచ్చుకుందే! ఇప్పుడు వాపోతే ఏంలాభం !? ..."

"చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకున్నట్లుంది మన పరిస్థితి ! గవర్నమెంటు బస్సులొస్తే యాక్సిడెంట్లు తగ్గుతాయనుకుని సంబరపడ్డాంగాని ఇలా మనల్ని చంపుకుతింటారని కల్లోకూడా అనుకున్నామా !! ..."

"వేళకి రావు. వేళకి పోవు, వస్తే అన్ని బస్సులూ ఒకేసారి జట్టు కట్టుకుని మరీ వస్తాయ్ !..."

"దూరపు కొండలు నునుపన్న సామెత పుట్టిందా !? ... ఈ లంపటం తల కెత్తుకోడం కోసం—ఎంతమంది విద్యార్థులు చదువులు తగిలడ్డాయని ! ఎన్ని ఘోరాలు జరిగాయని ! !"

"అలాగనుకుంటే ఎలా ? ... మనం ఆశించినట్లు బస్సులొచ్చాయ్ ! యాక్సిడెంట్లూ తగ్గాయి కదా ? ఇక అవక తవకలనేవి ప్రతి దాంట్లోనూ వుంటాయ్ ! వాటిని కట్‌చేసే విధానాల గురించి ఆలోచించాలి గాని — మరీ ఇలా జావకారిపోతే ఏం లాభం చెప్పండి ? ..."

"... ... ..."

"... ... ..."

అలా వాపోతున్నవారు కొందరైతే— మరి కొందరు "రయిట్ ! రయిట్ !!" అంటూ అదే పనిగా ఫుట్ బోర్డు మీద అతికష్టంతో ఫీట్స్‌చేస్తున్న వాళ్ళు దభీ దభీమని బస్సుమీద బాదేస్తున్నారు. టిఫిన్— కాఫీ సేవించి, సిగరెట్‌దమ్ములోని మజాను ఆస్వాదిస్తూ వచ్చిన కండక్టరు—డ్రయివర్ ప్రయాణీకుల బాధను అర్థంచేసుకున్న వాళ్ళలా వెంటనే తమ విధినిర్వహణలో మునిగిపోయారు. బస్సు ముందుకి కదలడంతో 'హమ్మయ్య !' అనుకుని సంతృప్తిపడి అంతవరకూ పడ్డ బాధను ఇట్టే మరచిపోయారంతా.

ఓ అరగంట గడచింతర్వాత బస్సు సూపర్ బజారుదగ్గర ఆగ్గా— అందరితోబాటు చక్రవర్తి, తన భార్యామణి సుందరికూడా దిగారు.

"ఆటోలో పోదాంఅనుకుంటే వినిపించుకున్నారుకాదు, ఇప్పుడు చూడండి— మన మొహాలెలా వున్నాయో ?... ఈ చెమటకంపుతో— జిడ్డు ముఖాలతో మనం రిసిప్షన్‌కి ఎలా వెళ్ళడంఅండీ ? పార్టీ లేదు, గిర్టీ లేరు, పదండి మళ్ళీ ఈ బస్సులోనే మనింటికి పోదాం." భర్త తనమాట కాదంటూ బస్సులో తీసుకొచ్చినందుకు రోడ్డుమీదే చక్రవర్తిని దుల్పేయ సాగిందామె.

"కాసేపు గాల్లోతిరిగితే చెమటదే పోతుంది. నీ హేండ్‌బేగ్‌లోని సెంట్‌బాటల్‌కి కాస్తపని కల్పించావంటే నానవంటిని అంటిపెట్టుకున్న సుగంధం— ఆ సెంట్ పరిమళంలో ఇట్టే కలసిపోతుంది. మరేం పర్లేదు పద ! వాళ్ళ పెళ్ళికీ వెళ్ళలేకపోయాం. కనీసం రిసిప్షన్‌కైనా వెళ్ళకపోతే ఏం బాగుంటుంది చెప్పు ?"

"అలా అంటే ఎలాగండీ ? కాస్త ముఖం కడుక్కుని— పౌడరు పూసుకుంటేగాని ముఖం తేటపడదు. మీ కంతగా వెళ్ళాలనివుంటే మీరు వెళ్ళి రండి. నే మాత్రం రాను."

"నీవు లేకుండా నేవెళ్తే ఏం బాగుంటుంది!.. సరే ! ముందా ఫోటోస్టుడియోకి పద." అంటూ ఎదురుగావున్న ఫోటోస్టుడియో చూపించాడు తను.

"ముఖం కడుక్కోడానికి పదో — పదిహేనో తగలేసి ఫోటో తీయించుకోవాలా !? ... శుభ్రంగా ఆటోలోవస్తే ఈ గొడవుండేది కాదుగదా ?" అంటూ అయిష్టంగా భర్తను అనుసరించింది సుందరి.

వీళ్ళిద్దరినీ చూసిన ప్రొప్రయిటరు, "ఏ సైజు ఫోటో తీయాలండీ ?" అంటూ ఫోటో ఆల్బమ్ వారి ముందుంచాడు.

ఆల్బమ్ పేజీలు తిరగవేస్తూ, "ముందు నీవు ముఖం కడుక్కుని కాస్త తేటపడు." అన్నాడు చక్రవర్తి — భార్యనుద్దేశించి.

పది నిముషాల్లో మైసూరు సేండల్ సబ్బు పెట్టి ముఖం కడుక్కోవడం — తల దువ్వుకోడం— ఫేన్ గాలిని ఆస్వాదించడం — పౌడరు రాసుకోడం వగైరా — వగైరాలైంతర్వాత — "మీరుకూడా కాస్త ముఖం కడుక్కుని రండి" అంది సుందరి చక్రవర్తితో.

"నా ముఖానికేం ? — బంగారంలా వుంది. నీ పని పూర్తయిందికదా ?... ఆఁ ! గురువుగారూ! ఈ సైజైతే బాగుంటుంది కదూ ?" ప్రొప్రయిటర్‌కి ఆల్బమ్‌లోని ఓ పెద్ద సైజు ఫోటో చూపిస్తూ అడిగాడు చక్రవర్తి.

"ఓఁ, బ్రహ్మాండంగా వుంటుందండీ! నేనూ ఇదే 'సజెస్ట్' చేద్దామనుకుంటున్నాను. ఈలోగా మీరే నిర్ణయం తీసుకున్నారు." చిరునవ్వు లొలక పోస్తూ అతి వినయంగా ప్రొప్రయిటర్ సమాధానమిచ్చాడు.

"కక్కుర్తిపడి మరీ పోస్టుకార్డు సైజు తీయించుకుంటే బాగుండదు కదండీ ? అందుకే నాకీ సైజు బాగా నచ్చింది. ఈ ఫోటో చాలా బాగా వచ్చిందండీ !! మా ఫోటో ఇంతకంటే బాగా

తీయాలండి!" ఆ ఫొటో వేపు తన్మయత్వంగా చూస్తూ అన్నారు చక్రవర్తి.

"ఓయస్! అలాగే తీస్తానండి!" ప్రొప్రైటర్.

"గురువుగారూ! కలర్ ఫొటోలు తీస్తున్నారా మీరు ?"

"లేదండి! వాటికి ఖర్చెక్కువండి! ఎవరో కొంతమంది మీలాంటివాళ్ళు తప్ప తీయించుకోరండి! అందుకే కలర్ జోలికి పోదలచుకోలేదు," ప్రొప్రయిటర్.

"ఓ. కె! ఇంతకీ ఈ సైజు ఫొటోకి ఎంత తీసుకుంటున్నారు మీరు ?"

"పాతికరూపాయలండి!"

"ఆహా! ... ఎడ్వాన్సెంతివ్వాలంటారు ? ఓ అయిదిస్తే సరిపోద్దా ? ... లేక పూర్తిగా డబ్బంతా ఇప్పుడే ఇచ్చేయాలా ?"

"ముందుగా డబ్బంతా ఇచ్చేస్తే మరీ మంచిదనుకోండి. అడ్వాన్సు అయితే మాత్రం ఓ పదిహేనైనా ఇవ్వాలండి!"

"మీరన్నట్టు వుంటే అంతా ఒక్కసారి ఇచ్చేయడం మీకు మాకూ మంచిదే అనుకోండి. ప్రస్తుతం జేబులో ఆ మాత్రం డబ్బులేక్కాదు. డబ్బున్నా ఇంటికి వెళ్ళేదాకా ఏవో అనుకోని ఖర్చులంటూ వుంటాయి కదండి ?" అంటూ కొన్ని క్షణాలు ఆగి ప్రొప్రయిటర్ ముఖంలోకి నవ్వుతూ చూడసాగాడు చక్రవర్తి.

చక్రవర్తి ఆంతర్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక తికమక పడుతూ మౌనం వహించాడు ప్రొప్రయిటర్.

"అలా మవునం వహించారేవండి!? ... ఇంతకీ ఓ అయిదురూపాయలు మాత్రం అడ్వాన్సిస్తే మీరిప్పుడు మాకు ఫొటో తీస్తారా, తీయరా చెప్పండి." సూటిగా తన అభిప్రాయాన్ని తెలిపాడు చక్రవర్తి.

ఆముదం తాగిన ముఖంలా అయ్యింది — ప్రొప్రయిటర్ది.

"సారీ, సర్!" అనేసి సీట్లోంచి లేచిపోయాడు ప్రొప్రయిటర్ — 'మా భలేబేరం వొచ్చింది!' స్వగతంలా అనుకుంటూ—విసుక్కుంటూ.

"ఓ.కె.ఇంకా ఇక్కడెందుకే మనం. పద. నాకు తెల్సినవాడి స్టుడియో ఇక్కడికి దగ్గర్లోనే వుంది. అక్కడ తీయించుకుందాం!" అంటూ చక్రవర్తి కుర్చీలోంచి లేచి బయటకు దారి తీసేసరికి — "అదేవిటండి!? ఇలా తీసుకొచ్చేస్తున్నారు!?" అంటూ బోల్డంత ఆశ్చర్యపోతూ భర్తను అనుసరించిందామె.

"వాడు సగం కంటే ఎక్కువ ఎడ్వాన్సు ఇవ్వందే ఫొటో తీయడనీ — నీ ముఖం తేటపడందే నాతో రిస్పెక్ట్‌కి రావనీ నాకు ముందే తెల్సుకాబట్టే ఈ ఫొటో— తతంగం!..." అంటూ భార్యామణి నోరు నొక్కేశాడు చక్రవర్తి. ★


# అన్నిరకముల ఊరగాయలకు

అగ్‌మార్క్‌కాబడిన

A.S బ్రాండ్ పప్పునూనె

మాన్షన్ బ్రాండ్ నువ్వులనూనె

లనే వాడండి




70 సంవత్సరములుగా ప్రఖ్యాతి గాంచినవి.

అన్నివంటలకు శ్రేష్ఠమైనవి.

## అంబటి సుబ్బన్న & కో., సామర్లకోట.

బ్రాంచీలు : (1) డా. పుర్భుక్కి స్ట్రీటు తెనాలి. Phone: 3150.

(2) 1–3–166 రాజా మొదలియార్ స్ట్రీటు, కలాసిగూడా సికింద్రాబాద్ Phone : 76160.

బళ్ళారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల, కర్నూలు, బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగపూర్‌లలో మా ఏజంట్లు కలరు.

Babu - ARTS.